క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, బాలసముద్రం కూరగాయల మార్కెట్, అంబేడ్కర్ కూడలి, రమేష్ డాక్టర్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 7నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు అంబేడ్కర్ సంఘం వార్షికోత్సవం

నయీంనగర్: తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం 48వ వార్షికోత్సవ సభను సుబేదారి ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు అరుణ్‌కుమార్, ఎడ్ల అర్జున్, సంజీవరావు, ప్రేమ్‌సాగర్, నక్క భిక్షపతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాటు చేయండి



ఖిలా వరంగల్: రంగలీల మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, సభ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిషోర్ ఝాను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ బాబు మాట్లాడుతూ వేడుకలను తిలకించడానికి నగరంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు వస్తారని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, శివమూర్తి, రంజిత్, సందీప్, వాసు, అజయ్, బత్తిని అఖిల్, అశోక్, శ్రీను, మధు, నాగరాజు, కృష్ణం రాజు, రాజశేఖర్, మనోహర్, వంశీ, రవీందర్, బాలసాయి మహేష్ పాల్గొన్నారు.

పెరిగిన ధరలపై నిరసన



కాజీపేట: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యకర్తలు కాజీపేట చౌరస్తాలో శుక్రవారం ఆందోళన చేశారు. పెరిగిన నూనె, ఉల్లి, అల్లం, ఎల్లిగడ్డ, కూరగాయలను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని పెరిగిన ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కొట్టె వెంకటేష్, కొట్టిపాక రవి, మాలోతు శంకర్‌నాయక్, రాసమల్ల దీన, పూర్ణచందర్, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పలు మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఫాతిమానగర్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం ఎదుట పరిసరాలను భారత ఆహార సంస్థ ఉద్యోగులు శుక్రవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ మేనేజర్ ధీరాజ్ కుమార్ మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ స్వప్నమైన వికసిత భారత్ సాధనకు అందరు కలిసి నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు సి.జగదీశ్వర్, ఐత రాజు, హరికిషన్, ఇంద్రాలాల్, అజయ్, రాజ్‌కుమార్, వెంకటస్వామి, శంకర్ పాల్గొన్నారు.

పత్తిలో తెగుళ్లను నివారించాలి

వరంగల్: పత్తిలో తెగుళ్లను నివారించాలని వరంగల్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు బి.రాజు, కె.గోపిక, కె.స్వాతి రైతులకు సూచించారు. కళాశాల దత్తత గ్రామం ఆరెపల్లి సమీపంలోని కొత్తపేటలో పంటలను శుక్రవారం వారు పరిశీలించారు. కలుపు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షాలతో పత్తి పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ (660 గ్రాములు)తోపాటు స్ట్రెప్టోసైక్లిన్ 20 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అనంతరం కలుపు యాజమాన్యం, ట్రికోడర్మా విరిడి ప్రాముఖ్యత, వృద్ధి చేసుకునేందుకు అవలంబించాల్సిన పద్ధతులపై ప్రదర్శనలు ఇచ్చారు. ఈ మేరకు రైతులకు శిక్షణ ఇచ్చారు.

డబ్బాల పేరుతో నెలవారీ వసూళ్లు

- చిరువ్యాపారులతో నేతల అనుచరుల అక్రమ వ్యాపారాలు
- పట్టించుకోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు



చైతన్య స్కూల్ మలుపులో ఏర్పాటు చేసిన జ్యూస్ పాయింట్ డబ్బా



తిలక్‌రోడ్డులోని హోటల్ ముందు పెట్టిన డబ్బాలు

వరంగల్: వరంగల్ నగరంలో పలు డివిజన్లలో కార్పొరేటర్ల అండతో రోడ్లపైనే డబ్బాలు వెలుస్తున్నా పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి. 21వ డివిజన్‌లో చైతన్య స్కూల్ ఎదుట రోడ్డుపై జ్యూస్ పాయింట్ పేరుతో ఓ డబ్బా పెట్టి నెలలు కావస్తున్నా కార్పొరేషన్ అధికారులు దృష్టి పెట్టలేదు. మెయిన్‌రోడ్డు నుంచి లోపలికి వెళ్లే దారిలో మూలమలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. డబ్బాను తొలగించాలని అడిగితే కార్పొరేటర్ అనుమతితో పెట్టుకున్నామనే సమాధానం వస్తోందని డివిజన్ వాసులు వాపోతున్నారు. ఇలా ప్రతీ డివిజన్‌లో ఏదో ఒకచోట రోడ్డుపై పదుల సంఖ్యల్లో డబ్బాలు వెలుస్తున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డబ్బా పెట్టు.. కిరాయి పట్టు

డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో డబ్బాలు పెట్టించి నెలవారీగా కిరాయి వసూళ్లకు పార్టీల నాయకులు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలు, కార్పొరేటర్ల వెంట అనునిత్యం తిరిగే చోటామోటా నాయకులు వారికి నచ్చిన చోట పలువురికి డబ్బాలు పెట్టించి అద్దె వసూళ్లు చేస్తున్న దందా దశాబ్దాలుగా సాగుతోంది.

పట్టించుకోని సిటీ ప్లానింగ్ విభాగం

నగరంలోని ప్రధాన రహదారులకు ఇరుపక్కలా, మూల మలుపుల్లో పాన్‌షాపులు, బిర్యానీ షాపుల కోసం విచ్చలవిడిగా డబ్బాలు పెడుతున్నా కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇష్టారాజ్యంగా వెలుస్తున్న డబ్బాలు, మిర్చి బండ్లు, తోపుడు బండ్లను అధికారులు అదుపు చేయకపోవడం వెనుక నెలవారీ మామూళ్ల దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది. కాశిబుగ్గ తిలక్‌రోడ్డులోని ఒక టీ హోటల్ పక్కన, ముందు రెండు డబ్బాలు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ అనుమతితో ఆ డబ్బాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. తనకు అడ్డుగా ఉందని రెండు డబ్బాలను దుకాణ యజమాని రోడ్డపై శుక్రవారం పడేశాడు. రోడ్డుపైన డబ్బాలు పడినా కార్పొరేషన్ అధికారులు తీసివేయకపోవడంపై నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



కేయూలో లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు



ఎస్‌డీఎల్‌సీఈ జర్నలిజం విభాగంలో పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, తదితరులు



వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో..



టీఎస్ఎస్పీలో కమాండెంట్ బి.రాంప్రకాశ్

స్వాతంత్య్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశ సేవలకు అంకితమైన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నగర వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమాలతో పాటు ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.

- సాక్షి నెట్‌వర్క్

మాదిగలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న మంద కుమార్

హసన్‌పర్తి: మాదిగల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు.. మాదిగ జాతికి క్షమాపణ చెప్పాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఎంఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎప్పుడూ మాలల పట్ల అనుచితంగా వ్యవహరించలేదన్నారు. కేవలం జనాభా దామాషా ప్రకారమే రిజర్వేషన్ల కోసం పోరాటం చేసినట్లు గుర్తుచేశారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారపు భిక్షపతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, ఎంఎస్పీ నాయకులు పుట్ట రవిమాదగ, బండారి సురేందర్, బొక్క నారాయణ, ఆరెపల్లి వవన్, రజనీకుమార్ పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, మాదిగలను కించపరిచే విధంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడటం సరికాదని, ఈక్రమంలో మాదిగలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తిరుపతి మాట్లాడుతూ మాల ఉద్యోగుల సమావేశంలో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారని అన్నారు. సమావేశంలో కేయూ ఎంఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఓదెల అరిస్టాటిల్, బాధ్యులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్: వయోవృద్ధుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం (అక్టోబర్ 1) సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ జంక్షన్ వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్పొరేటర్ గందె కల్పన, వరంగల్, వర్ధన్నపేట సీడీపీఓలు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శాంతితోనే పర్యాటక రంగం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: శాంతితోనే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలోని హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ మనోహర్, విభాగం అధిపతి డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్, సోషియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, పాలకమండలి సభ్యుల పాల్గొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్లు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి పాల్గొని పర్యాటక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌సీసీ కెడెట్లు రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



బతుకమ్మ సంబరాల్లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు

కేయూ క్యాంపస్: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో శుక్రవారం ముందస్తుగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో లభించే పూల పండుగగా బతుకమ్మను అభివర్ణించారు. అనంతరం తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, డాక్టర్ ప్రగతి, డాక్టర్ ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి సన్మానం

కాజీపేట: సీపీసీఎల్ ఇంజనీరింగ్ విభాగంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన నీరటి సాయి కిరణ్‌ను కాజీపేటలో ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో సాయికి శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, నీరటి రాజు, అమ్మగారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు బకాయిలు చెల్లించాలి



మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లోని వ్యాపారులు బకాయిలు వెంటనే చెల్లించాలని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల అన్నారు. పండ్ల వ్యాపారులతో మార్కెట్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత కూరగాయల మార్కెట్‌లోని గదులను అప్పగించామని, వారం రోజుల లోపు ఇప్పటి వరకు ఉన్న బకాయిలను చెల్లించాలన్నారు. దసరా పండుగ తర్వాత బకాయిలను చెల్లిస్తామని కార్యదర్శికి వ్యాపారులు తెలిపారు.

రైతుల ఖాళీ బస్తాలకు రూ.50లు చెల్లించాలి

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తులు తెచ్చే రైతుల ఖాళీ బస్తాలు ఒక్కోదానికి రూ.50ల చొప్పున ఖరీదుదారులు(వ్యాపారులు) చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి పి.నిర్మలను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శి ఎస్.రాము, రైతు సంఘాల నాయకులు ఓదెల రాజయ్య, ఊరటి హంసాల్‌రెడ్డి, సిరుల రవీందర్ పాల్గొన్నారు.

బాలల రక్షణ ప్రతీఒక్కరి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న వెంకన్న

హసన్‌పర్తి: బాలబాలికల రక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని ఏహెచ్‌టీయూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న గుర్తుచేశారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయి కమిటీలు, క్షేత్రస్థాయిలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లకు ఒక రోజు అవగాహన సదస్సును హసన్‌పర్తి మండల పరిషత్ సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీని ఉపయోగించి మానవ అక్రమ రవాణా పాల్పడుతున్నారని, ఈక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా హింసకు పాల్పడినట్లయితే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100 నంబర్లకు డయల్ చేయాలని సూచించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సహాయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైల్డ్ కమిటీ సభ్యుడు దామోదర్, బాలల సంరక్షణ విభాగం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బత్తుల కరుణ, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మాఫీతో సంబంధం లేకుండా రుణాలు చెల్లించాలి

వరంగల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలను రుణమాఫీకి సంబంధం లేకుండా చెల్లించాలని వరంగల్ పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ సూచించారు. ఆరెపల్లిలోని పీఏసీఎస్ ఎరువుల గోదాంలో శుక్రవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రుణం తీసుకున్న ప్రతీరైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో రైతులందరు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వివరించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోసియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈఏడాది నవంబర్ 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రపంచీకరణ అభివృద్ధి, సామాజిక పరివర్తనపై సదస్సు నిర్వహించనున్నట్లు విభాగం అధిపతి, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పరిశోధన పత్రాలను అక్టోబర్ 20వ తేదీలోగా పంపాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ మనోహర్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కుంట అయిలయ్య, ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

హన్మకొండ చౌరస్తా: డీఎస్సీ, గ్రూప్ -2 ఉద్యోగార్థులకు తమతో శిక్షణ ఇచ్చిన బకాయిలు చెల్లించాలని రామప్ప కోచింగ్ సెంటర్ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్ కోరారు. హనుమకొండలోని అకాడమీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లా షెడ్యూల్డ్ క్యాస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రూప్ -2, డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ అందించేలా తమతో అధికారులు ఒప్పందం చేసుకున్నారని గుర్తుచేశారు. 400 మందికి మూడు నెలల పాటు ములుగురోడ్డులోని రామప్ప జూనియర్ కళాశాలలో భోజనం, వసతి కల్పిస్తూ మెరుగైన శిక్షణ అందించామని గుర్తుచేశారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి భోజన, వసతి కోసం రూ.75, శిక్షణ ఇచ్చే ఫ్యాకల్టీకి ఒక్కో సెషన్ కు రూ.వేయి చెల్లించేలా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. రెండు జిల్లాలకు సంబంధించి రూ.35 లక్షలు రావాల్సి ఉండగా కేవలం రూ.15లక్షలు మాత్రమే చెల్లించారని అన్నారు.

స్నేహపూర్వక పోటీతత్వం కలిగి ఉండాలి

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులు స్నేహపూర్వక పోటీతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే ఉన్నతస్థాయిలో రాణిస్తారని మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ అన్నారు. పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీల్లో అండర్ -14, 17 బాలబాలికలకు నిర్వహించే పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేష్‌బాబు, మర్కజీ హైస్కూల్ హెచ్ఎం రామారావు, ప్రాక్టీసింగ్ హైస్కూల్ హెచ్ఎం జగన్నాథం, ఒలింపిక్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నలుబోలు సతీష్, లయన్స్ క్లబ్ హనుమకొండ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, పీడీ, పీఈటీలు శ్రీధర్‌రావు, రాణి, మల్లారెడ్డి, కర్ణాకర్, శోభ, సరళ, మనోహర్, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం, ఆరోగ్యం

హసన్‌పర్తి: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు స్పోర్ట్స్ టీషర్ట్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్, సభ్యులు నాగమళ్ల సుధీర్, వెలగందుల భీష్మనాథం, శ్రీదేవి, రాములు, ఉపాధ్యాయులు శీలం పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

రావణవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని మహంకాళి దేవాలయ ప్రాంగణంలో అక్టోబర్ 12న జరగనున్న రావణవధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ అన్నారు. ఈమేరకు రంగశాయిపేటలోని కాంక్ష కాన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో కార్యదర్శి దామెరకొండ కరుణాకర్, ముత్తినేని రామమూర్తి, రామకృష్ణ, ప్రసాద్, రాజశేఖర్, భాస్కర్, రాజేశ్వర్‌రావు, వీరేశం, మనోహర్, వేణు, అశోక్, నవీన్‌కుమార్, భిక్షపతి, కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ పోలీసుల రక్తదాన శిబిరం

కాజీపేట రూరల్: ఆర్పీఎఫ్ రైజింగ్ డేను పురస్కరించుకొని కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ (ఆర్పీఎఫ్)లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు ఆధ్వర్యంలో హనుమకొండ లయన్స్ క్లబ్, హనుమకొండ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో జరిగిన శిబిరంలో ఆర్పీఎఫ్ సిబ్బంది, కమర్షియల్, టెలికాం, ఇంజనీరింగ్, పీవే, ఎలక్ట్రికల్ ఇతర డిపార్ట్‌మెంట్ల సిబ్బంది రక్తదానం చేశారు.

ఎన్టీఆర్‌నగర్‌లో గుంతల పూడ్చివేత

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఎదుట ఎన్టీఆర్‌నగర్‌కు వెళ్లే దారిలో సుధాకర్ హోటల్ క్రాస్ వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్‌నగర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కొత్తపల్లి యాదగిరి, అడుప మహేష్, శ్రీరాం రఘుపతి పాల్గొన్నారు.

పలువురికి జరిమానాలు

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురు వాహనదారులకు రూ.9 వేల జరిమానా విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20మందికి రూ.28,200 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

ఎంజీఎం: రాష్ట్రవ్యాప్తంగా అర్బన్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న సపోర్టింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా డిమాండ్ చేశారు. ముగ్గురు సపోర్టింగ్ స్టాఫ్‌గా ఉన్న సిబ్బందిలో ఒకరు ఎంఎస్ఓ, మరొకరు వాచ్‌మెన్, ఇంకొకరు స్వీపర్‌గా ఉన్నారని అన్నారు. వారు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ కుటుంబ పోషణకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ నేటికీ దాని విధి, విధానాలు ప్రకటించలేదని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, శ్రీపతిరెడ్డి అంతిరెడ్డి, కోశాధికారి గోపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీధర్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



కప్‌తో జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మడికొండ: జూడో జాతీయ స్థాయి పోటీలకు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికై నట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈనెల 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -14 జూడో చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో విద్యార్థులు జీ.దీపిక, కే.సహజ, తహనియత్, హిమవర్ధిని పాల్గొని ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలను సాధించగా, కే.సహస్ర కాంస్య పథకాన్ని సాధించినట్లు వివరించారు. క్రీడాకారులతో పాటు జూడో శిక్షకుడు నాగరాజు, పీడీ పద్మను, పీఈటీ పద్మను ప్రిన్సిపాల్, తదితరులు అభినందించారు.

కూచిపూడి నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ కల్చరల్: నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో హనుమకొండలోని ది స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 'ది టెంపుల్ డాన్స్'కు చెందిన విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. సెప్టెంబర్ 19నుంచి 25వ తేదీల్లో తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో జూనియర్ విభాగంలో కుందూరు అనిశ్రిత రెడ్డి ప్రథమ బహుమతి, సబ్ జూనియర్ విభాగంలో జనన్య వర్మ ద్వితీయ బహుమతి, చన్విత కన్సోలేషన్ బహుమతి సాధించారు. ఈ మేరకు బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ సంగీత అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాలా నుంచి బహుమతులు స్వీకరించారు. వారిని నృత్య గురువు హిమాన్షి కాట్రగడ్డ, తదితరులు అభినందించారు.

సైన్స్‌సెంటర్‌లో స్టెమ్ వర్క్‌షాప్



కాజీపేట అర్బన్: హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో యూత్ ఫర్ సేవా వరంగల్ ఆధ్వర్యంలో నగరంలోని పలు పాఠశాల విద్యార్థులకు స్టెమ్ వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోబోటిక్స్, ఇన్నోవేషన్స్‌పై మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, నిట్ ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, సైన్స్ సెంటర్ అధికారి రాకేష్, ప్రధానోపాధ్యాయుడు స్వామి, యూత్ ఫర్ సేవా ప్రతినిధులు రామేశ్వర్, మల్లికార్జున్, రాజ్‌కుమార్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.